న్యూస్‌రీల్

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా విద్యాశాఖ సమన్వయంతో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జంతువులపై దయ, కరుణ చూపాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ డాక్టర్ శంకర్‌లింగం, సెక్టోరల్ అధికారి కె.చౌదరి, పర్యావరణ విద్య శిక్షకుడు గుండేటి యోగేశ్వర్, శ్రీనివాసవర్మ, సునితాదేవి, భాగ్యలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

లాలా లజపతిరాయ్ జయంతి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కోటపల్లి: మండలంలోని బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో లాలా లజపతిరాయ్ జయంతిని పురస్కరించుకుని హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి లాలా లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కేతేశ్వరి స్వామి ఉత్సవాలు షురూ



పూజలు చేస్తున్న తహసీల్దార్

జన్నారం: మండల కేంద్రంలోని ఈర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ స్వామి వార్ల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పూజారి భూమయ్య స్వామి ఆధ్వర్యంలో శనివారం దేవతలకు అభిషేకం, పూజలు జరిపారు. ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇట్యాల వెంకటకిషన్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, వైస్ చైర్మన్ చిలువేరు నర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 31నుంచి వచ్చే నెలలో మూడు రోజుల పాటు దేవర్ల పౌర్ణమిని పురస్కరించుకుని సమ్మక్క, సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజక్క, సమ్మక్క, సారక్క, బిక్కయ్యలు తెలిపారు. మంగళవారం పసుపు కుంకుమ సమర్పణ, బుధవారం కంకవనం నుంచి దేవస్థానం తీసుకురావడం, గురువారం అమ్మవార్లకు బోనాలు నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.10
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	60
కాకరకాయ	70
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	80
ములక్కాయ	120
సోరకాయ	30
పూగోబి	70
ఆకుగోబి	60
తోటకూర	40
పాలకూర	40
క్యారెట్	60

\- మంచిర్యాలఅగ్రికల్చర్



పైపు పగిలింది.. నీటి సరఫరా నిలిచింది



మిషన్ భగీరథ పైపు పగలడంతో వృథాగా పోతున్న నీరు



మోటార్‌తో ట్రాక్టర్‌లోకి నీటిని ఎక్కిస్తున్న సిబ్బంది

పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద పది రోజుల క్రితం జాతీయ రహదారి మరమ్మతులు నిర్వహిస్తుండగా మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. ఆ పైపు ద్వారా సుందరయ్య కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకుకు, అక్కడి నుంచి జ్యోతినగర్, తీగల్‌పహడ్, అల్లూరి సీతారామమరాజు నగర్, లక్ష్మినగర్, తదితర కాలనీలకు నీటి సరఫరా అవుతుండగా, ప్రస్తుతం ఆ పైపు పగలడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పైపునకు మరమ్మతు చేయాల్సి ఉండగా, వృథాగా పోతున్న నీటిలో మోటార్ వేసి నీటిని హైవే పనులకు వినియోగిస్తుండడం గమనార్హం. ఈ విషయమై గ్రిడ్, నేషనల్ హైవే అధికారులు ఒకరిపై ఒకరు చెప్పకుంటూ, కాలయాపన చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ డీఈ అన్నయ్యను 'సాక్షి' సంప్రదించగా గ్రిడ్ అధికారులు నీటి సరఫరాను నిలిపివేస్తే మరమ్మతులు చేపడుతామన్నారు. గ్రిడ్ ఏఈ వినయ్‌ని సంప్రదించగా నీటి సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతు నిర్వహించి నీటి వృథాను అరికట్టి కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.

\- నస్పూర్

వాహనాలకు తుప్పు..!



పట్టుబడిన వాహనాలు



మాయమైన ఆటో టైర్లు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీ రేంజి పరిధిలో అక్రమంగా కలప తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అటవీ రేంజి కార్యాలయ ఆవరణలో పట్టుబడిన కార్లు, సుమోలు, వ్యాన్లు, ఆటోలు వంటి వాహనాల నిల్వలు పేరుకుపోయి, ఎందుకు పనికి రాకుండా తుప్పెక్కి పోతున్నాయి. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన విడిబాగాలు కూడా మాయమవుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి పట్టుబడిన వాహనాలను వేలం వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై రేంజి అధికారి రత్నాకర్‌రావును సంప్రదించగా వాహనాల వేలానికి సంబంధించిన ప్రక్రియను త్వరలో చేపడతామని చెప్పారు.

పట్టుదలతో చదివి ఉన్నతంగా రాణించాలి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: విద్యార్థులు శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లు, ప్లేట్లను ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు. సీఓఈ బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సొంత ఖర్చుతో వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చిన్నయ్య తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ, జెడ్పీటీసీ చంద్రయ్య, బెల్లంపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. దేవాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకొని మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ, ఎమ్మెల్యే చిన్నయ్య, మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, కార్మిక సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

రషీద్ మరణం తీరని లోటు

తాండూర్: తెలంగాణ ఉద్యమ కారుడు ఎస్‌కే రషీద్ లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం రాత్రి రషీద్ సంతాప సభ నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై రషీద్ చిత్రపటం నివాళులర్పించారు. కార్యక్రమంలో సినీగేయ రచయిత తైదల బాపు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో ఏడు తీర్మానాలు



మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం ఏడు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పారిశుద్ధ్య పనులను మెరుగుపర్చేందుకు అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని ఆరు నెలల పాటు తీసుకునేందుకు అయ్యే ఖర్చు రూ.22లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ చేసేందుకు రూ.2.50లక్షలను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి పూజలు



పూజల్లో పాల్గొన్న డైరెక్టర్, అధికారులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ, డీజీఎం చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సింగరేణి యోగా క్లబ్ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సతీమ బి, సేవామితి ఏరియా అధ్యక్షురాలు లక్ష్మి హాజరై కార్యక్రమం ప్రారంభించారు. యోగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ ముల్కల్ల శంకర్, కొంపెల్లి రమేష్, రాజలింగు, అనంతాచార్యులు, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి తదతరులు ఉన్నారు.

గడపగడపకూ పీఎస్ఆర్



క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న సురేఖ

శ్రీరాంపూర్: కృష్ణాకాలనీలో శనివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ పీఎస్ఆర్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ కొక్కిరాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేంసాగర్‌రావు చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను వివరించారు. దీనికి సంబంధించి న్యూ ఇయర్ క్యాలెండర్‌ను కూడా ఆమె ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు ఆడెపు శ్యామల, కుర్మిళ్ల మహేశ్, ఆమె వెంట వార్డు నాయకులు పాల్గొన్నారు.

'వినూత్న బోధన బాగుంది'



విద్యార్థులతో ఎంపీడీవో వరలక్ష్మి

నెన్నెల: మానవుడి అవయవాల చిత్రాలు ముందు వెనుక భాగంలో ముద్రించి వాటిని విద్యార్థులకు ధరించి సులభంగా అర్థమయ్యేలా బోధించే వినూత్న బోధన చాలా బాగుందని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. నార్వాయిపేట పాఠశాలను శనివారం సందర్శించి 'మనఊరి–మనబడి' అభివృద్ధిని, పాఠశాల విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు చేస్తున్న వినూత్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోడూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సదయ్య, జలంపల్లి శ్రీనివాస్, స్నేహలత, రాజ్‌కుమార్, కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే



మాట్లాడుతున్న రహిమతుల్ల

జన్నారం: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే అవసరమని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు రామిరెడ్డి అన్నారు. ధర్మారం పాఠశాలలో శనివారం ప్రముఖ మాస్టర్ రహిమతుల్ల ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవడానికి ముందుకు వచ్చి, ఆత్మరక్షణకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన ఏర్పాటు చేయాలని వినతి



గద్దె రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి 24వ వార్డులో వాగు అవతల వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారికి వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వెంటనే వంతెన నిర్మించాలని కోరుతూ టీడీపీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి షరీఫా, నాయకులు వాసాల సంపత్, సింగతి రంగనాథ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మేనేజర్ శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని నాయకులు శనివారం స్థానిక మున్సిపల్ మేనేజర్ శ్రీహరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి దోమలు, ఈగలు, పందులు, కోతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధులతో తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఎండీ ఆరీఫ్, శ్రీధర్, నవాబ్‌ఖాన్, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, హాజి, కిషన్, అమీర్, రవి పాల్గొన్నారు.

ఆసుపత్రి తరలింపు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిని పాత ఎంపీడీవో కార్యాలయంలోకి తరలిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని రోగులు సహకరించాలని కోరారు.

పోలీసు ఉద్యోగాలు సాధించాలి

- జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువతి, యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం శారీరకదారుఢ్యంలో శిక్షణ ఇవ్వగా 197మంది అభ్యర్థులు రాత పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. రాత పరీక్ష కోసం శనివారం సీసీసీ కార్నర్‌లోని సృష్టి ఇన్స్టిట్యూట్‌లో కంపెనీ ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను జీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) గోవిందరాజు, సీనియర్ పీవో కాంతారావు, ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

రక్షణాధికారికి సన్మానం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: ఏరియా సేఫ్టీ అధికారి గోషిక మల్లేశ్ ఈ నెల 31తో ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్కే-7 గనిపై శనివారం గుర్తింపు సంఘం నాయకులు, ఉద్యోగులు కలిసి ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. గతంలో మేనేజర్‌గా కూడా విధులు నిర్వర్తించి గనిని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రమాదాల నివారణకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ మెండె వెంకటీ, నాయకులు అశోక్, తొంగల రమేశ్, బుచ్చన్న, ప్రతాప్, రాజునాయక్, లక్ష్మీనారాయణ, మల్లయ్య, ప్రణయ్, పాదం శ్రీను పాల్గొన్నారు. అనంతరం హెచ్ఎమ్మెస్ నాయకులు పిట్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గోషిక మల్లేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు శివకుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, మురళీ, మధు, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న గంగారెడ్డి

భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామపంచాయతీకి చెందిన పలువురు శనివారం బీజేపీలో చేరారు. బిట్టూర్‌పల్లి గ్రామపంచాయతీ మూడో వార్డు సభ్యుడు కొంక సత్యనారాయణ, పొట్లపల్లి శేఖర్, పొట్లపల్లి సత్యనారాయణకు జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏసీపీ బదిలీ



ఏసీపీ ఎడ్ల మహేశ్

మంచిర్యాలక్రైం: బెల్లంపల్లి ఏసీపీగా పని చేసిన ఎడ్ల మహేష్‌ను పెద్దపెల్లి ఏసీపీగా బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021అక్టోబర్ 4న బెల్లంపల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టి బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించడం, వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాట్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా క్రీడాకారుల అభ్యున్నతికి పాటుపడ్డారు. శాంతి భద్రతల పరిరక్షణకు, అక్రమ రవాణ, నేరాల నియంత్రణకు కృషి చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడం గమనార్హం.

జయప్రదం చేయండి

జన్నారం: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 30న మందకృష్ణ మాదిగా నిర్వహించే అనాథల అరిగోస దీక్షను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ మండల కన్వీనర్ పూర్ణపు రాజరావ్ కోరారు.